సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 9 । జూన్ । 2025



అంధ మహిళా క్రికెట్ క్రీడాకారులకు ప్రోత్సాహం 8లో



సంఘాల నిర్మాణంతో పాటు ఉద్యమాన్ని విస్తరించాలి 8లో



శశిధర్.. ట్రెండ్‌సెట్టర్ 8లో

• ఓహో ఓహో పావురమా..



సాగర తీరం నిత్యం సందడిగా ఉంటుంది. ముఖ్యంగా ఉదయం వేళల్లో కపోతాల దండు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రామకృష్ణా బీచ్ , పాండురంగాపురం ప్రాంతాలలో వందలాది పావురాలు ఉదయాన్నే కిలకిలారావాలతో సందడి చేస్తుంటాయి. ఉదయం వాకింగ్‌కు వచ్చే నగరవాసులు, పర్యాటకులు వీటికి ఆహారం వేయడం సర్వసాధారణం. సుమారు రెండు మూడు గంటల పాటు ఈ పావురాలు ఆకాశంలో రివ్వున ఎగురుతూ, అలలపై వాలి సందడి చేస్తాయి. ఈ కపోతాలు పర్యాటకులతో, ముఖ్యంగా చిన్నారులతో ఎంతో స్నేహంగా మెలుగుతాయి. పిల్లలు సైతం వాటితో ఆడుకుంటూ సంతోషంగా గడుపుతారు.

• ఆసనం..ఆరోగ్యం



నగరంలోని పోర్టు స్టేడియంలో యోగాంధ్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి పైగా నగర ప్రజలు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల ఆసనాలను వేశారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ

• సర్ఫింగ్ అదరహో



నగరంలోని తెన్నేటి పార్కు బీచ్‌లో ఓ యువకుడు తన సర్ఫింగ్ విన్యాసాలతో సందడి చేశాడు. అలలపై నైపుణ్యంగా దూకుతూ, గంతులు వేస్తూ పర్యాటకుల దృష్టిని ఆకర్షించాడు. అతని సాహసోపేత విన్యాసాలు బీచ్‌కు వచ్చిన వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

న్యూస్‌రీల్

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా వాణి



మహారాణిపేట: కేజీహెచ్ నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఐ.వాణి నియమితులయ్యారు. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖలో అడిషనల్ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా పదోన్నతి పొందిన డాక్టర్ వాణి, ప్రస్తుతం కేజీహెచ్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా, గైనిక్ విభాగాధిపతి (హెచ్‌ఓడీ)గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ. కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ పి. శివానంద్ 16 నెలల పాటు ఈ పదవిలో ఉన్నారు.

నేటి 'పీజీఆర్ఎస్' రద్దు

మహారాణిపేట: సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. సోమవారం నాడు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొనున్న నేపథ్యంలో పీజీఆర్ఎస్ వాయిదా వేశామన్నారు.

నేడు 'షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ - 2025'

మహారాణిపేట: మార్చి 2025లో జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించేందుకు 'షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ - 2025' కార్యక్రమం సోమవారం జరగనుంది. సిరిపురంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌తో పాటు ఇతర ప్రముఖులు, విద్యా శాఖాధికారులు హాజరుకానున్నారు.

ఏపీఈఏపీసెట్‌లో కీర్తనకు 34వ ర్యాంక్



కూర్మన్నపాలెం: వడ్లపూడికి చెందిన గురు కీర్తన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో సత్తా చాటింది. రాష్ట్ర స్థాయిలో 34వ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. కీర్తన ఉక్కునగరంలోని డీఏవీపీ స్కూల్‌లో ప్రాథమిక విద్యను, శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించింది. కీర్తన తండ్రి శ్రీనివాసరావు ఉక్కు కర్మాగారంలోని వాటర్ సప్లై విభాగంలో పనిచేస్తుండగా, తల్లి నీలవేణి గాజువాకలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కీర్తన మాట్లాడుతూ డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని చెప్పింది.

ఏసీబీలో దొంగాట!



'గిరి'గీసి మరీ వసూళ్లు

రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖ నుంచి భారీగా మామూళ్లు?

చక్రం తిప్పుతున్న ఓ డాక్యుమెంట్ రైటర్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

కంచే చేను మేసిన చందంగా మారిపోయిందనే విమర్శలు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వ్యవహారంలో వినిపిస్తున్నాయి. అవినీతి నిరోధానికి కృషి చేయాల్సిన సొంత శాఖకు చెందిన కొందరు అధికారులే నెలవారీ మామూళ్లకు అలవాటుపడి సమాచారాన్ని లీకు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలోనే గతంలో ఓ సీఐ స్థాయి అధికారిని బదిలీ చేసినట్టు తెలుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా రిజిస్ట్రేషన్లతో పాటు రవాణాశాఖ నుంచి ప్రతీ నెలా కొద్ది మంది నెలవారీ మామూళ్లు అందుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. సొంత శాఖకు చెందిన ఓ ఎస్ఐ, ఏఎస్ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, రిజిస్ట్రేషన్లశాఖ నుంచి మామూళ్లు ముట్టచెప్పడంలో ఓ డాక్యుమెంట్ రైటర్ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతీ నెలా 'గిరి'గీసి మరీ తంచనుగా కొద్ది మంది కీలకమైన అధికారుల నుంచి వసూలు చేసి ముట్టచెబుతున్నట్టు సమాచారం. అయితే ఈ మామూళ్ల వ్యవహారంలో ఎవరెవరికి ఎంత అందుతుందనే విషయంలో మొదలైన చర్చ రచ్చ కావడంతో ఈ వ్యవహారం పైదాకా వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించినట్టు ఆ శాఖలో గుసగుసలు వినపడుతున్నాయి. మొత్తంగా అవినీతిని కట్టడి చేయాల్సిన అధికారులే అవినీతి రొంపిలో కూరుకుపోతుండటం మాత్రం విస్తుగొలుపుతోంది.

ముందుగానే సమాచారం లీకు...!

వాస్తవానికి ఏసీబీలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఉన్న కొద్దిమంది సమర్థులైన అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకుని వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం ఒక ఉన్నతాధికారిపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినప్పటికీ, కిందిస్థాయిలో పేరుకుపోయిన కొందరు అవినీతి సిబ్బందిపై ఆయన సరైన స్థాయిలో చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలున్నాయి. ఏసీబీలో దీర్ఘకాలంగా తిష్టవేసిన ఒక ఎస్ఐతో పాటు ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సంస్థ పరువును నెలవారీ మామూళ్ల కోసం బజారున పడేస్తున్నారని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా అవినీతి ఆరోపణలున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖతో పాటు రవాణా, జీవీఎంసీ, రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి వీరు నెలవారీ మామూళ్లకు అలవాటు పడినట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలున్న సదరు నలుగురు సిబ్బంది డిపార్ట్‌మెంట్ల వారీగా వసూళ్లకు తెగబడుతున్నట్లు సమాచారం. ఇంకా ఎక్కడి నుంచైనా ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత శాఖకు ముందుగానే సమాచారాన్ని లీక్ చేస్తున్నారని విమర్శలున్నాయి. ఒకవేళ ఎవరైనా తమ నెలవారీ మామూళ్లకు అంగీకరించకపోతే, వీరే వేరే పేర్లతో ఫిర్యాదు చేసి సదరు అధికారిపై దాడులు చేస్తారనే అపప్రద కూడా ఉంది. ఈ వ్యవహారంలోనే ఒక జీవీఎంసీ అధికారిని కూడా గతంలో ఇదే తరహాలో ఇబ్బంది పెట్టినట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. అయితే తాము చెప్పినట్లు వింటే వారిపై ఏ ఫిర్యాదు వచ్చినా కాపాడతారనే ధైర్యాన్ని కూడా ఈ సిబ్బంది కల్పిస్తున్నారని తెలుస్తోంది.

కీలకంగా డాక్యుమెంట్ రైటర్..!

ఏసీబీలో నెలవారీ మామూళ్ల వ్యవహారం మరింత ముదురుతోంది. **రిజిస్ట్రేషన్లు, రవాణా** శాఖల **నుంచి వసూలు చేసిన మామూళ్లకు సంబంధించి** ఒక **సీఐను ఇందులో ఇరికిం**చారని **తెలుస్తోంది. మొదట్లో** తన **విధులను మాత్రమే** చూసుకునే **సదరు సీఐని, నెల**వారీ **మామూళ్ల** రొంపిలోకి **లాగి, చివరికి** సొంత **శాఖ సిబ్బందే ఆయన్ను** అడ్డంగా **బుక్ చేసినట్లు** ఆరోపణ**లున్నాయి. దీం**తో శాఖ **పరువు** బజారున **పడకుం**డా, ఈ **వ్యవహా**రాన్ని **బయట**కు పొక్క**కుండా** గుట్టుగా **బదిలీ**తో సరిపె**ట్టిన**ట్లు సమాచారం.

ఈ మామూళ్ల వ్యవహారంలో ఒక డాక్యుమెంట్ రైటర్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతను రిజిస్ట్రేషన్ల శాఖలోని అధికారులతో సన్నిహి తంగా మెలుగుతూ నెలవారీ మామూళ్లను అందజేస్తున్నట్లు సమాచారం. సదరు డాక్యుమెంట్ రైటర్ ఓ ఉన్నతాధికారికి (గతంలో పనిచేసిన) అత్యంత సన్నిహితుడని ప్రచారం ఉంది. అందుకే ఎన్నో ఆరోపణలున్నప్పటికీ, రిజిస్ట్రేషన్ల శాఖలోని నలుగురైదుగురు అధికారులపై ఎటువంటి చర్యలూ ఉండవనే విమర్శలున్నాయి.

తాజాగా, ఇదే శాఖకు చెందిన ఒక అధికారి అవినీతికి సంబంధించి పక్కాగా కొన్ని వీడియోలు, ఫొటోలతో సహా అందిన ఫిర్యాదును కూడా పక్కదారి పట్టించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. భారీ వాణిజ్య భవంతిని నిర్మించి, అద్దెకు పెట్టి అడ్డంగా దొరికినప్పటికీ, ఆ అధికారిని కాపాడారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారినట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ, ఏసీబీ పరువును బజారున పడకుండా ఉండేందుకు రహస్యంగా ఉన్నతస్థాయిలో విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యాశాఖ తీరుపై ఎస్జీటీల కన్నెర్ర

- వెబ్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా డీఈవో కార్యాలయ ముట్టడి
- విద్యాశాఖ మంత్రి లోకేశ్ మాట మార్చారంటూ ఆక్షేపణ



విశాఖ డీఈవో కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన టీచర్లు

ఆరిలోవ: విద్యాశాఖలో బదిలీల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై గురువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకో నిబంధన, గంటకో సవరణ, తొలుత ఇచ్చిన హామీని విస్మరించడపై నిరసన గళం వినిపించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ) ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విశాఖ జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. నగరంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల నుంచి వందల మంది టీచర్లు ఉదయం 9 గంటలకే డీఈవో కార్యాలయానికి చేరుకొని కదం తొక్కారు. వెబ్ కౌన్సెలింగ్ వద్దు.. మాన్యువల్ కౌన్సెలింగే ముద్దు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి, ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపడతామని చెప్పి, ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామనడం ఆక్షేపణీయమన్నారు. గతంలో విద్యాశాఖా మంత్రి లోకేశ్ మాన్యువల్ కౌన్సెలింగ్ అని మాటిచ్చి, ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా వందల ఆప్షన్లు ఇవ్వడం కష్టమన్నారు. మాన్యువల్ ద్వారా అయితే అవసరమైన వాటిలో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు అభిప్రాయాలు, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్జేడీ కె.విజయభాస్కర్, డీఈవో ఎస్.ప్రేమకుమార్‌లకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు డి.గోపినాథ్, ఇమంది పైడిరాజు, టి.చిన్నబ్బాయి, టి.రామకృష్ణారావు, అరుణ్‌కుమార్, వీరభద్రరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే న్యాయం



ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే న్యాయం జరుగుతుంది. వెబ్ కౌన్సెలింగ్‌లో ఎదురయ్యే ఇబ్బందులను నివారించాలి. వెబ్ కౌన్సెలింగ్‌లో 1,000 నుంచి 2,000 ఆప్షన్లను ఎంచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. వెబ్ కౌన్సెలింగ్ సమయంలో వాటిని వెతుక్కోవడం కష్టమవుతుంది. దీనివల్ల ఉపాధ్యాయులకు అనవసరమైన ఇబ్బందులు ఏర్పడతాయి. ఉపాధ్యాయ సంఘాల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడం బాధాకరం.

-ఇమంది పైడిరాజు, ఎస్టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి,

మాట మార్చిన విద్యాశాఖ అధికారులు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీల కౌన్సెలింగ్‌లో మాన్యువల్ విధానం అవలంబిస్తామని విద్యాశాఖాధికారులు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని తుంగలో తొక్కుతున్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు మాన్యువల్ కౌన్సెలింగ్ కోరుకుంటున్నారని, ఇంతమంది కోరుతున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ విధానాన్ని పక్కనబెట్టి, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్న వెబ్ కౌన్సెలింగ్‌ను అమలు చేయడం సరికాదు.

-డి.గోపీనాథ్, పీఆర్‌టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు

తారస్థాయిలో పైరవీలు

- నేటితో ముగియనున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ
- కూటమి ఎమ్మెల్యేల నుంచి భారీగా సిఫార్సు లేఖలు
- పోస్టును బట్టి ధర నిర్ణయించినట్టు ప్రచారం

మహారాణిపేట: ఉద్యోగుల బదిలీలకు గడువు సోమవారంతో ముగియనుండడంతో పైరవీలు తారస్థాయికి చేరుకున్నాయి. రెండు చేతులా డబ్బులు వచ్చే స్థానాల కోసం ఉద్యోగులు కూటమి ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పోస్టును బట్టి, మండలం/జిల్లాను బట్టి రేట్లు నిర్ణయించి బేరసారాలకు దిగుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిఫార్సు లేఖల జారీకి ముందు ధరలు నిర్ణయించారని ప్రచారం జరుగుతోంది.

కీలక పోస్టులకు డిమాండ్

ప్రధానంగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ఇంజినీర్ల పోస్టులకు సిఫార్సు లేఖల కోసం తీవ్ర పోటీ నెలకొంది. భీమిలి, విశాఖ రూరల్, ఆనందపురం, పెందుర్తి, సీతమ్మధార తహసీల్దార్ పోస్టులకు మంచి గిరాకీ ఉందని, ఈ స్థానాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విశాఖలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన వారు ఇక్కడి నుంచి కదలకుండా, గ్రామీణ ప్రాంతాల వారు నగరంలో పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నారు.



పాలనాపరమైన ప్రయత్నాలు

ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాల కలెక్టర్ల సమావేశంలో తహసీల్దార్ల బదిలీలపై ప్రధానంగా చర్చించారు. విశాఖలో పనిచేస్తున్న వారిని ఏజెన్సీకి, అక్కడ పని చేస్తున్న వారిని విశాఖకు బదిలీ చేసే ప్రతిపాదనలు పరిశీలించారు. అలాగే కొందరు విశాఖ తహసీల్దార్లను ఇతర ప్రాంతాలకు పంపాలని విశాఖ కలెక్టర్ యోచిస్తున్నట్లు సమాచారం.

సిఫార్సు లేఖల వెల్లువ

రెవెన్యూ శాఖలో అన్ని కేడర్ల బదిలీల కోసం కూటమి ఎమ్మెల్యేల నుంచి 132 సిఫార్సు లేఖలు కలెక్టరేట్‌కు అందినట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోలు, ఇతర ఉద్యోగుల బదిలీలకు కూడా లేఖలు అందాయి. మొత్తం 68 వ్యక్తిగత దరఖాస్తులు కూడా రాగా, మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సిఫార్సులు, ఫోన్ కాల్స్ పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు సమాచారం. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పని చేస్తున్న తహసీల్దార్లు కూడా విశాఖలో పోస్టింగ్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

అత్యున్నత స్థాయిలో యోగా డే

- అధికారులు బాధ్యతతో పనిచేయాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

మహారాణిపేట: ఈ నెల 21న జరగనున్న యోగా దినోత్సవాన్ని అధికారులు పూర్తి బాధ్యతతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నందున ఈ యోగా దినోత్సవం దేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహించే విధంగా ఉంటుందని, జిల్లాలో దీన్ని అత్యున్నత స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది ప్రజలు పాల్గొననుండగా, ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి బీచ్ వరకు, అలాగే వివిధ స్టేడియంలలో యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ఏర్పాట్లలో తమ అనుభవాన్ని ప్రతిబింబించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం జరిగే మొత్తం ప్రాంతాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ అధికారులకు వివరించారు. ప్రజలను బస్సుల ద్వారా కంపార్ట్‌మెంట్ ప్రాంతాలకు చేర్చిన తర్వాత ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బస్సులను పార్కింగ్ ప్రదేశాలకు తరలించాలని అదేవిధంగా కార్యక్రమం తర్వాత ప్రజలను వారివారి ప్రాంతాలకు సురక్షితంగా చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు, ముఖ్య అతిథులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యుత్ పార్కింగ్, రవాణా, వైద్యం తదితర అంశాలపై ముందస్తు ఏర్పాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ యోగా కార్యక్రమంలో విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల నుంచి ప్రజలు భారీగా హాజరుకానుండటంతో, ఆర్టీసీ అధికారులు మంచి స్థితిలో ఉన్న బస్సులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అన్ని రకాల ఔషధ సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రధాన కార్యక్రమం అనంతరం, అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యార్థులతో సూర్య నమస్కారాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ రికార్డు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఏపీఈపీడీసీఎల్ పృధ్వీరాజ్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద కళా సంబరాలు



వేదికపై కళాకారుల ప్రదర్శన

ఆరిలోవ: ఉత్తరాంధ్ర నవ చైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 13వ వార్డు ఆరిలోవ కాలనీ శివాజీనగర్-2లోని ముత్యాలమ్మ గుడి వద్ద జానపద కళా సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర కళాకారులు పలు జానపద కళలు ప్రదర్శించి స్థానికులను ఆకట్టుకున్నారు. చిన్నారుల నృత్యాలు, జానపద పాటలు అలరించాయి. కళాకారులకు నృత్యాలు, జానపద పాటలు, నాటికల ప్రదర్శన, కోలాటం తదితర వాటిపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఉత్తరాంధ్ర జానపద కళలను ప్రదర్శించి, పరిచయం చేయాలని ఆశిస్తున్నానన్నారు.

విశాఖలో ట్రాఫిక్ కష్టాలపై 'అస్త్రం'

- ప్రజల రవాణా కష్టాలకు చెక్
- యాప్ ప్రారంభించిన హోం మంత్రి అనిత



ఏసీ హెల్మెట్‌ను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: విశాఖపట్నంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు పోలీసులు రూపొందించిన 'అస్త్రం' యాప్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం ఆవిష్కరించారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, విశాఖ ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ కష్టాలు తనకు తెలుసునని చెప్పారు. 'అస్త్రం' యాప్ ప్రజలకు ఉపయోగపడేలా, 'పబ్లిక్ ఫ్రెండ్లీ'గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా ట్రాఫిక్ జామ్స్, క్లియరెన్స్ సమయం, ప్రత్యామ్నాయ మార్గాల వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఇది ట్రాఫిక్ సిబ్బందికి కూడా సమన్వయంతో పనిచేయడానికి ఉపయోగపడుతుందన్నారు. యాప్‌తో నగరంలో ట్రాఫిక్ కష్టాలకు దాదాపుగా చెక్ పెట్టవచ్చని, నగర ప్రజలు గమ్య స్థానాలకు సురక్షితంగా చేరేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుం దన్నారు. టెలిగ్రామ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోగల ఈ యాప్ మూడు నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని హోం మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్లు అందజేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీలు అజిత వేజెండ్ల, ప్రశాంతి, ట్రాఫిక్ ఏడీసీపీ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

సంఘాల నిర్మాణంతో పాటు ఉద్యమాన్ని విస్తరించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

దాబాగార్డెన్స్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యల రెండు సంస్థల విలీన సభ సందర్భంగా ఆదివారం దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాహిత్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా విప్లవ సాంస్కృతికోద్యమ నిర్మాణంలో భాగమైన రెండు సంఘాల విలీనం అవసరమన్నారు. మార్క్సిజం, లెనినిజం, మావోయిజం భావాలున్న వారు ఐక్యమవ్వాల్సిన అవసరం ఉందని, రాజకీయ కార్యాచరణ ద్వారానే ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో కార్పొరేట్ మనువాదం, సామ్రాజ్యవాదం పెరిగిపోతున్నాయని, మోదీ ప్రభుత్వం ప్రశ్నించే వారిని అణచివేస్తోందని ప్రొఫెసర్ కాశీం విమర్శించారు. ఇటువంటి తరుణంలో కళాకారులు ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ఉందని, ఆ దిశగా అరుణోదయ కళాకారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, మందసలో ఎయిర్‌పోర్టు రాకుండా రైతుల భూములను రక్షించాలని కోరారు. తెలంగాణ అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మోదీ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. సభాధ్యక్షుడు నాగరాజు అమర కళావీరులను స్మరిస్తూ తీర్మానం చేశారు. ముందుగా సరస్వతి పార్క్ నుంచి సభావేదిక వరకు అరుణోదయ కళాకారుల కళా ప్రదర్శన ఆటపాటలతో సాగింది. కార్యక్రమంలో తెలంగాణ అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నశెట్టి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి అంజయ్య, కె నిర్మల, ఎస్.జయలక్ష్మి, పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు, న్యాయవాది చలం అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు.

అంధ మహిళా క్రికెట్ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది శరత్‌బాబు

ఉక్కునగరం: ఎన్టీపీసీ సింహాద్రి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ కేరళ సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు స్టేడియంలో అంతర్ రాష్ట్ర అంధ మహిళల క్రికెట్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధ మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. క్రీడాకారులకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సుప్రీంకోర్టు అడ్వకేట్ శరత్‌బాబు తన వంతుగా విజేత జట్టుకు రూ. 75 వేలు, రన్నరప్ జట్టుకు రూ. 25 వేలు బహుమతులుగా అందజేస్తానని ప్రకటించి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. పోటీల్లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు, కేరళ జట్టుపై 79 పరుగుల తేడాతో విజయం సాధించింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో ఒడిశా జట్టు, ఢిల్లీ జట్టును 49 పరుగుల తేడాతో ఓడించి గెలుపొందింది. కార్యక్రమంలో విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు, ఎన్టీపీసీ సింహాద్రి యూనిట్ ప్రతినిధి అనిల్, ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డి, కో-ఆర్డినేటర్లు అమ్మినాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, పిల్లలను రక్షించిన ఆర్పీఎఫ్

అల్లిపురం: ఒడిశాలోని నవరంగపూర్‌కు చెందిన నలుగురు మహిళలు, ముగ్గురు యువకులు, ముగ్గురు పిల్లలతో సహా మొత్తం పది మందిని అక్రమంగా తరలిస్తున్న దళారుల నుంచి రైల్వే పోలీసులు రక్షించారు. వారిని జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బందికి అప్పగించగా.. జీవీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న టీఎస్సార్ షెల్టర్లకు ఆదివారం తరలించారు. దళారుల మాయమాటలు నమ్మి.. టికెట్ లేకుండా రైలు ప్రయాణం చేస్తూ, వలస వెళ్తున్న గిరిజనులను రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ రామకృష్ణ తెలిపారు. దళారీ ముఠా సభ్యులను విచారించిన తర్వాత బాధితులను వారి స్వస్థలాలకు పంపుతామని సీఐ పేర్కొన్నారు.

శశిధర్.. ట్రెండ్‌సెట్టర్



- నగర యువ కెరటం.. ద్విముఖ ప్రజ్ఞ
- మోడల్‌గా, నృత్య కళాకారుడిగా ప్రతిభ
- అంతర్జాతీయ వేదికపై రాణింపు

ఒకవైపు ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలో ర్యాంప్‌పై హొయలొలికిస్తూ, మరోవైపు శాస్త్రీయ నృత్య వేదికపై అభినయంతో అబ్బురపరుస్తూ.. ఇలా రెండు విభిన్న రంగాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నాడు నగరానికి చెందిన 26 ఏళ్ల శశిధర్. చిన్ననాటి అభిరుచులను వదలకుండా వాటినే తన కెరీర్‌గా మలచుకున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకుంటూ నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ఇటీవల దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ నృత్య పోటీల్లో 'యువ ప్రతిభ పురస్కారం' అందుకోవడమే ఇందుకు నిదర్శనం.

- బీచ్‌రోడ్డు

నగరంలోని ఓల్డ్ డెయిరీ ఫారానికి చెందిన శశిధర్ పైడిరాజు పాండ్రాడ చిన్నతనం నుంచే ఫ్యాషన్, సంప్రదాయ నృత్య ప్రదర్శనల పట్ల విపరీతమైన ఆసక్తి ఉండేది. పాఠశాలలో సంప్రదాయ నృత్యానికి ప్రోత్సాహం లభించగా, ఇంట్లో అతని సోదరుడు ఫ్యాషన్ పట్ల ఆసక్తిని పెంచాడు. అన్నయ్య తెచ్చిన విభిన్న రకాల దుస్తులను శశిధర్ ధరించి అందరినీ ఆకర్షించేవాడు. అలాగే పాఠశాల కార్యక్రమాల్లో తన నృత్య ప్రదర్శనలతో అందరినీ మంత్రముగ్ధులను చేసేవాడు.



నటుడు సుమన్ చేతులమీదుగా మహా స్వర్ణ నంది అవార్డు అందుకుంటున్న శశిధర్(ఫైల్)

యువతకు మార్గదర్శిగా.. 'జేఆర్‌డీ ఫ్యాషన్స్'

తాను ఎదిగిన ఫ్యాషన్ రంగంలో తనలాంటి మరెందరికో దారి చూపించాలనే లక్ష్యంతో శశిధర్ 2022లో జేఆర్‌డీ ఫ్యాషన్స్ సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా ఇప్పటి వరకు 27 మందికి ఫ్యాషన్, నటనలో శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్నాడు. భవిష్యత్తులో మరింత మంది యువతను ఉన్నత శిఖరాలకు చేర్చడమే తన ఆశయమని శశిధర్ తెలిపాడు.

ఫ్యాషన్ రంగంలోకి అడుగులు

డిగ్రీ చదువుతున్న సమయంలో శశిధర్ కొన్ని కారణాలతో సంప్రదాయ నృత్యాన్ని కొంతకాలం పక్కన పెట్టాడు. ఆ సమయంలో తన దృష్టిని పూర్తిగా ఫ్యాషన్‌పై కేంద్రీకరించాడు. డిగ్రీ స్థాయిలో జరిగిన ఫ్యాషన్ పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చదువుతున్నప్పుడు జరిగిన హైదరాబాద్ ఫ్యాషన్ వీక్ 2018 లో 'ఉత్తమ ఆకర్షణీయమైన కళ్లు' అవార్డును గెలుచుకున్నాడు.

మిస్టర్ కొచ్చి 2021 విజేత

చదువు పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో ఫ్యాషన్ రంగంపై శశిధర్ దృష్టి సారించాడు. 2021లో కొచ్చిలో జరిగిన ఫ్యాషన్ పోటీల్లో 'మిస్టర్ కొచ్చి 2021' విజేతగా నిలిచాడు. ఆ తర్వాత, ఆంధ్ర ఫ్యాషన్ వీక్ సీజన్ 1 లో 'ఉత్తమ యువ డిజైనర్ అవార్డు 2024', విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో 'ఉత్తమ స్టైల్ అవార్డు 2024'ను సొంతం చేసుకున్నాడు.

అవార్డులే అవార్డులు

ఇటీవల దుబాయ్‌లోని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆఫ్ దుబాయ్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ నృత్య పోటీల్లో ఎస్‌కేఎస్ అకాడమీ నుంచి ఎనిమిది మంది నృత్య కళాకారులు ప్రదర్శనలిచ్చారు. ఇందులో శశిధర్ ప్రదర్శించిన ఒడిస్సీ నృత్యానికి 'యువ ప్రతిభ పురస్కారం' లభించింది. అలాగే శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ నుంచి 'జాతీయ మహా స్వర్ణ నంది అవార్డు'ను అందుకున్నాడు. 2024లో 'యాక్టివ్ ఉగాది పురస్కారం' కూడా శశిధర్‌కు లభించింది.



దుబాయ్‌లో నృత్య ప్రదర్శన ఇస్తున్న శశిధర్

నాట్యకళకు తిరిగి ప్రాణం పోసిన వేళ..

చదువుపై దృష్టి సారించే క్రమంలో చిన్నప్పుడు నేర్చుకున్న శాస్త్రీయ నృత్యానికి దూరమైనా.. దానిపై మమకారం చావలేదు. 2024లో ఓ అవార్డు కార్యక్రమంలో శశిధర్ మాట్లాడుతూ భరతనాట్యం, కూచిపూడి అంటే తనకెంత ఇష్టమో చెప్పిన మాటలు తన జీవితాన్ని కీలక మలుపు తిప్పాయి. ఆ మాటలు విన్న ఎస్‌కేఎస్ అకాడమీకి చెందిన పక్కి అరుణ్ కుమార్ సాయి.. శశిధర్‌ను కలిసి తన నృత్య ప్రతిభను ప్రదర్శించమని కోరారు. అతనిలోని ప్రతిభను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అలా ఏళ్ల క్రితం ఆగిపోయిన నాట్య ప్రయాణం మళ్లీ ప్రారంభమైంది. గురువు అరుణ్ శిక్షణలో రాటుదేలిన శశిధర్.. అతి తక్కువ కాలంలోనే అంతర్జాతీయ వేదికలపై తన సత్తా చాటాడు.

అమ్మ ప్రోత్సాహంతోనే..

మోడల్‌గా, నృత్య కళాకారుడిగా రాణించడంలో అమ్మ పాత్ర ఎంతో ఉంది. పాఠశాల రోజుల్లో వివిధ రకాల ప్రదర్శనల్లో నన్ను పాల్గొనేలా ప్రోత్సహించింది. ఫ్యాషన్ రంగంలోకి వెళ్తానంటే సపోర్ట్ చేసింది. నృత్యం ఇక నా జీవితంలో ఉండదు అనుకునే సమయంలో మా గురువు పక్కి అరుణ్ కుమార్ సాయి ప్రోత్సాహం మరువలేనిది. ఈ రెండు రంగాల్లో ఉన్నత స్థానంలో ఉండాలని నిరంతరం పట్టుదలతో శ్రమిస్తున్నా..

- శశిధర్ పైడిరాజు పాండ్రాడ



తల్లితో శశిధర్

దివీస్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

తగరపువలస: బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న దువ్వారపు సత్యప్రకాష్ (31) అనే దివీస్ ఉద్యోగి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పశ్చిమ గోదావరి జిల్లా, ఉండ్రాజవరం మండలం, రజకుల పేటకు చెందిన సత్యప్రకాష్ దివీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు మూడేళ్ల క్రితం లక్ష్మీదుర్గతో వివాహం జరిగింది. బాలాజీనగర్‌లో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్న సత్యప్రకాష్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. శనివారం ఇంట్లో ఉన్న సమయంలోనే స్పృహ కోల్పోయి పడి ఉండటాన్ని అతని భార్య గమనించింది. నోటి వెంట నురగలు కూడా రావడంతో ఆటోలో భర్తను అనిల్ నీరుకొండ జనరల్ ఆసుపత్రికి తరలించింది. అక్కడ పరీక్షించిన వైద్యులు సత్యప్రకాష్ మృతి చెందినట్టు నిర్ధారించారు. భీమిలి పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేట్లకు కేంద్రం వత్తాసు

సిటు అఖిల భారత కోశాధికారి సాయిబాబు



మాట్లాడుతున్న సిటు అఖిల భారత కోశాధికారి సాయిబాబు

దాబాగార్డెన్స్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ విధానాలు దేశ ఆర్థిక స్వావలంబనను దెబ్బతీశాయని సిటు అఖిల భారత కోశాధికారి సాయిబాబు ఆరోపించారు. దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సిటు 18వ జాతీయ మహాసభల ఆహ్వాన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ కేంద్రం బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మిక శక్తి ఏకమై వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 1970లో ఐక్యతా నినాదంతో ప్రారంభమైన సిటు.. విద్యుత్ ప్రైవేటీకరణ వంటి అంశాలపై దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తోందన్నారు. కార్మిక సంఘాలకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకువచ్చిన నల్ల చట్టాలను సిటు విజయవంతంగా అడ్డుకుందన్నారు. 1991 నుంచి ఇప్పటివరకు 21 సార్వత్రిక సమ్మెలు నిర్వహించామని, వచ్చే నెల 9న జరగనున్న సమ్మెను కూడా కార్మిక సంఘాలు ఐక్యంగా నిర్వహించాలని కోరారు. ఎన్డీఏ హయాంలో దేశ జీడీపీని ప్రభావితం చేసే రంగాలు కుదేలయ్యాయని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వద్ద ప్రణాళికలు లేవని విమర్శించారు. రైల్వే, డిఫెన్స్ రంగాల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. పెహల్గాం ఉగ్రదాడి అనంతరం మత విభజన జరిగేలా బీజేపీ చేసిన ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టారన్నారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల సభ్యులు ఈ సభల విజయానికి కృషి చేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పోరాటం

సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ తమ సంఘం పోరాటం వల్లే ఇప్పటివరకు స్టీల్ ప్లాంట్ ప్రైవేట్‌పరం కాలేదన్నారు. ఆర్ఎస్ఎస్ వారిని స్టీల్ ప్లాంట్ సీఎండీలుగా నియమించి.. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో కార్మిక వర్గాన్ని అణచివేసే చర్యలు చేపడుతున్నారని, ఇది కేంద్ర ప్రభుత్వ ప్రోద్బలంతోనే జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖను ఒక ప్రయోగశాలగా చూస్తోందన్నారు.

పవన్ కల్యాణ్‌పై సిటు విమర్శలు

సిటు పోరాటంలో భాగంగా స్టీల్ ప్లాంట్ కోసం ఆత్మహత్య చేసుకున్న బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారని నరసింగరావు గుర్తు చేశారు. అలాంటి పవన్ కల్యాణ్ ఇప్పుడు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అనుకూలంగా ఎన్డీఏ పక్షాన నిలబడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం తర్వాత ఇంతటి కార్మిక అణచివేత చర్యలు ఎప్పుడూ జరగలేదన్నారు. అనంతరం ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి విశాఖలో నిర్వహించనున్న 18వ జాతీయ మహాసభల ఆహ్వాన కమిటీని సిటు రాష్ట్ర అధ్యక్షుడు కేవీ నాగేశ్వరరావు ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా సీహెచ్ నరసింగరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కేఎస్‌వీ కుమార్, కోశాధికారిగా ఏవీ నాగేశ్వరరావు వ్యవహరిస్తారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో ఎసెంట్ విజయకేతనం



భార్గవ్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ మురళీకృష్ణ

మద్దిలపాలెం: ఏపీ ఈఏపీసెట్-2025(ఫార్మా) ఫలితాల్లో ఎసెంట్ మెడికల్ అకాడమీ విద్యార్థులు మరోసారి అత్యుత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ ఎం.వి.ఆర్.మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థి ఎం.తులసీభార్గవ్ రామ్ రాష్ట్ర స్థాయిలో 69వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. అలాగే 14 మంది విద్యార్థులు 500 లోపు ర్యాంకులు సాధించి ఎసెంట్ హవాను కొనసాగించారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు వరుసగా 69, 88, 92, 93, 193, 194, 205, 248, 279, 317, 319, 406, 467, 485 ర్యాంకులతో పాటు 140 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఈ విజయం వెనుక తమ డైరెక్టర్లు, అధ్యాపక బృందం కృషి, పట్టుదల ఉన్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా 69వ ర్యాంకు సాధించిన ఎం.తులసి భార్గవ్ రామ్‌ను పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

ఈఏపీసెట్‌లో కుందనేశ్వరికి 46వ ర్యాంక్



గొందేశి కుందనేశ్వరి

పెదగంట్యాడ: ఏపీ ఈఏపీసెట్‌లో 2025 ఫలితాల్లో మండలానికి చెందిన గొందేశి కుందనేశ్వరి 46వ ర్యాంక్ సాధించింది. కోరాడకు చెందిన ఆమె తండ్రి గొందేశి సత్యనారాయణ రెడ్డి స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి. రామలక్ష్మి గృహిణి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ ర్యాంక్ సాధించినట్లు కుందనేశ్వరి తెలిపారు.

ఆసనాలతో ఆరోగ్యయోగం





యోగాసనాలు వేస్తున్న సీనియర్ సిటిజన్స్, ఉద్యోగులు, క్లిష్టమైన యోగాసనం వేస్తున్న ఉమామహేశ్వరరావు

సీతంపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఆదివారం 'యోగాంధ్ర' ఉత్సాహంగా సాగింది. వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, యూసీడీ మహిళలు, విద్యార్థులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. యోగా శిక్షకుల సూచనలకు అనుగుణంగా వివిధ ఆసనాలు వేశారు. యోగాసనాలతో పాటు ఓం శాంతి ఆధ్వర్యంలో ధ్యానం చేశారు. 78 ఏళ్ల సీనియర్ సిటిజన్ ఉమామహేశ్వరరావు క్లిష్టమైన యోగసనాలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. జూన్ 21న విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో నగర ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యమై విజయవంతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు



పోర్టు స్టేడియంలో ఆసనాలు వేస్తున్న ప్రజలు

వీసీబీ సభ్యులకు 12 శాతం డివిడెండ్

- మహాజన సభలో చైర్మన్ రాఘవేంద్రరావు ప్రకటన



మాట్లాడుతున్న వీసీబీ చైర్మన్ రాఘవేంద్రరావు

మద్దిలపాలెం: ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు(వీసీబీ) 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.71.77 కోట్ల నికర లాభం సాధించిందని, వాటాదారులకు 12 శాతం డివిడెండ్ (రూ. 43.06 కోట్లు) అందిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ప్రకటించారు. మద్దిలపాలెంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన బ్యాంకు మహాజన సభలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు డిపాజిట్లు 4.98 శాతం వృద్ధితో రూ. 4354.73 కోట్లకు, రుణాలు 7.42 శాతం వృద్ధితో రూ. 3436.47 కోట్లకు చేరాయన్నారు. బ్యాంకు మొత్తం వ్యాపారం 6.04 శాతం వృద్ధితో రూ.7791.20 కోట్లకు చేరుకుందని, నికర నిరర్థక ఆస్తులు సున్నా శాతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకుకు 55 శాఖల్లో 1,11,593 మంది సభ్యులు ఉన్నారని, షేరు ధనం రూ. 389.55 కోట్లకు చేరిందని రాఘవేంద్రరావు తెలిపారు. పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఈ ఏడాది మరో 5 కొత్త శాఖలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంకు సీఈవోగా వి.వి.బి.వరలక్ష్మి నియామకానికి మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సహకార రంగానికి, బ్యాంకుకు సుదీర్ఘకాలం సేవలందించిన పూర్వ అధ్యక్షుడు మానం ఆంజనేయులును అభినందన సంచిక ఆవిష్కరణతో ఘనంగా గౌరవించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సభ్యులకు సహకార రంగంపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. బ్యాంకు పూర్వ జనరల్ మేనేజర్ ఎ.వి.రామకృష్ణారావును కూడా పాలకవర్గం సత్కరించింది. బ్యాంకు ఉపాధ్యక్షుడు ఎం.రాఘవరావు, డైరెక్టర్లు వి.చంద్రశేఖర్, పి.వి.నరసింహమూర్తి, జేవీ సత్యనారాయణమూర్తి, సూరపనేని నాగభూషణ చౌదరి, ఏజే స్టాలిన్, ఉన్నతాధికారులు, వివిధ శాఖల మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

అధికారిక లాంఛనాలతో 'పల్లా' అంత్యక్రియలు



సింహాచలం పార్థివదేహంవద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గాజువాక: మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఆదివారం జరిగాయి. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శనివారం నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. విశాఖ నుంచి ఆదివారం పార్థివ దేహాన్ని గాజువాక తీసుకొచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం గాజువాక హైస్కూల్ రోడ్‌లోని కైలాసభూమిలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, మేయర్ పీలా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, తిప్పల నాగిరెడ్డి, పీలా గోవింద సత్యనారాయణ, స్థానిక నాయకులు మంత్రి రాజశేఖర్, తిప్పల దేవన్‌రెడ్డి, టి.హర్షవర్ధన్ ప్రసాద్, పప్పు రాజారావు, కోన తాతారావు, పలువురు కార్పొరేటర్లు, పలువురు వాణిజ్య, అధికార ప్రముఖులు పల్లా సింహాచలం పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, పల్లా శంకర్రావులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గంభీరం చేపలకు భలే డిమాండ్

రుచికి ఫిదా అవుతున్న విశాఖ వాసులు



చేపలు శుభ్రం చేస్తున్న మత్స్యకారులు



గంభీరంలో చేపలు పడుతున్న మత్స్యకారులు

తగరపువలస: ప్రస్తుతం సముద్రంలో చేపల వేట నిషేధం అమలవుతుండటంతో తాజా చేపల లభ్యత తగ్గింది. ఇదే సమయంలో కొన్ని చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేసి చేపలను పెంచుతున్నారనే ప్రచారం, పట్టణ ప్రాంతాల్లోని కలుషిత నీటిలో పెరిగే చేపల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయనే భయాలు వినియోగదారులను చెరువు చేపలకు దూరం చేస్తున్నాయి. ఈ తరుణంలో గంభీరం రిజర్వాయర్‌లోని స్వచ్ఛమైన నీటిలో పెరిగిన చేపలు సురక్షితమైనవి, రుచికరమైనవి కావడంతో వాటికి అమాంతం గిరాకీ పెరిగింది. విశాఖ, మధురవాడ, తగరపువలస తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున గంభీరం రిజర్వాయర్‌కు తరలివస్తున్నారు. గంభీరం రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గడంతో, పద్మనాభం మండలం పాండ్రంగి మత్స్యకార సొసైటీ సభ్యులు చేపల వేట ముమ్మరం చేశారు. ఇక్కడ 8 కిలోల వరకు బరువున్న భారీ చేపలు కిలో కేవలం రూ.120కే లభిస్తుండటం విశేషం. అంతేకాదు కొనుగోలు చేసిన చేపలను అక్కడికక్కడే కిలోకు రూ.20 చెల్లిస్తే శుభ్రం చేసి ఇస్తుండటంతో వినియోగదారులకు శ్రమ తప్పుతోంది. పెద్ద చేపలను కొన్నవారు తమలో తాము వంతులు వేసుకొని పంచుకుంటున్నారు. ఈ రిజర్వాయర్ చేపల రుచి అమోఘం. ఇది మటన్‌ను కూడా మరిపిస్తుందని కొనుగోలుదారులు లొట్టలేసుకుంటూ చెబుతున్నారు. చేపలతో పాటు, వాటి గుడ్లతో కూడిన 'సొన'కు కూడా ప్రత్యేకంగా డిమాండ్ ఉంది. కొందరు చేపలను మాత్రమే తీసుకుని సొనను అక్కడే వదిలేస్తుండగా, దానిని ఇష్టపడేవారు రూ. 50 నుంచి రూ. 100 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఈ రిజర్వాయర్‌లో చేపలు 16 కిలోల వరకు పెరుగుతాయని, అయితే వాటిలో చాలా వరకు వయసు మీద పడటంతో సహజంగానే మరణిస్తాయని మత్స్యకారులు తెలిపారు.